సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



మళ్లీ మళ్లీ.. ఇదేం లొల్లి

ఒక ప్రక్రియ చేపడితే సులువైన మార్గం ఎంచుకోవాలి.. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలి.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తంతు మాత్రం ప్రహసనంలా మారింది..


8లో



అదిగో పులి.. ఇదిగో తోక

అదిగో పులి.. ఇదిగో తోక అంటూ వదంతులు గుప్పుమంటున్నాయి.. ఆదివారం రావులపాలెంలో చిరుత సంచరించిందంటూ వచ్చిన వదంతులు ప్రజల్లో భయాందోళన రేకెత్తిస్తున్నాయి.

2.79 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 2,79,446 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 10,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు



నిత్య గణపతి హోమంలో ద్రవ్యాలు వేస్తున్న భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, ఏకాదశ, లఘున్యాస రుద్రాభిషేకాలు చేశారు. స్వామికి మహానివేదన అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 30 మంది, లక్ష్మీగణపతి హోమంలో 15 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. ఏడుగురు చిన్నారులకు తులాభారం, 34 మంది నూతన వాహన పూజలు చేయించుకున్నారు. అన్నదాన పథకంలో 2,030 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయానికి రూ.1,81,227 ఆదాయం లభించిందని ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ తదితరులు

అమలాపురం రూరల్: పన్నెండో పీఆర్సీ ప్రకటన ఇప్పటికే ఆలస్యమైనందున తక్షణమే రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఫ్యాప్టో చైర్మన్ సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ విద్యా భవన్‌లో సంఘ జిల్లా తృతీయ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. 2022 నుంచి సరెండర్ లీవ్ బిల్లులు వెంటనే చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమానికి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. పి.గన్నవరం మండలం కుందాలపల్లి ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తూ ఆకస్మికంగా మరణించిన గోరుగంతు శ్రీనివాససాంబ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు ఎస్టీయూ అభయ్ స్కీమ్ ద్వారా రూ.2 లక్షల చెక్కును ఆయన అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, అభయ్ కన్వీనర్ ఆర్‌ఆర్‌కే ప్రసాద్, ఉపాధ్యాయవాణి కన్వీనర్ చిక్కం మైనర్‌బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చొప్పల రాంబాబు పాల్గొన్నారు.

లోవలో భక్తుల రద్దీ



తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన వేలాది మంది భక్తులతో లోవ దేవస్థానంలో రద్దీ నెలకొంది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన ఏడు వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, పూజా టికెట్లు, వసతి గదు ల అద్దెలు, కేశఖండనశాల, వాహన పూజలు, విరాళాల ద్వారా రూ.3,50,075 ఆదాయం సమకూరినట్టు ఆయన వివరించారు.

సరకులు చేతికందికుండా



- పేరుకే రేషన్ దుకాణాలు
- బియ్యం, పంచదార పంపిణీతో సరి
- వంటనూనె, గోధుమ పిండి, కందిపప్పు పంపిణీపై స్పష్టత కరవు

ఎన్నికల ముందు పేదలంటే టీడీపీ అధినేత చంద్రబాబు కపట ప్రేమ చూపారు.. ఎన్నెన్నో మాటలు చెప్పారు.. పార్టీని గెలిపిస్తే నిత్యావసరాల ధరలు అందుబాటులోకి తెస్తామని, రేషన్ దుకాణాలను పటిష్టం చేసి ఉప్పు నుంచి పప్పు వరకూ తక్కువ ధరకు అందిస్తామని హామీలు గుప్పించారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఆ ఊసేలేదు.. రేషన్ దుకాణాల్లో కందిపప్పు కాదు కదా ఏ సరకులూ సక్రమంగా ఇస్తున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం జరుగుతున్న విధానం తెలుసుకుందాం రండి..

అలమూరు: నిత్యావసర సరకుల ధరలు కొండెక్కాయి.. ఎంతకూ దిగిరానంటున్నాయి.. ఇలాంటి సందర్భాల్లో పేదలకు రేషన్ దుకాణాల్లో తక్కువ ధరకు సరకులు అందిస్తే ఎంతో మేలు చేసినట్టే. అయితే ఇక్కడ బియ్యం, పంచదార తప్ప ఎలాంటి సరకులు ఇవ్వడం లేదు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలుత కందిపప్పును రాయితీపై అందిస్తానని చంద్రబాబు ప్రకటించారు. దశల వారీగా నూనె, గోధుమ పిండి తదితర సరకులను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు దాటినా వంటనూనె, గోధుమ పిండి పంపిణీని పక్కన పెడితే ఇంకా కందిపప్పు పంపిణీపైనే స్పష్టత ఇవ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో ధరలు పెరిగినప్పుడు పేదలకు సాంత్వన చేకూర్చేందుకు రైతుబజార్లు, రేషన్ డిపోల ద్వారా రాయితీపై కందిపప్పు, గోధుమ పిండి, వంట నూనెలను అందించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అలాంటి చర్యలు కనిపించడం లేదు. జిల్లాలో 22 మండలాల పరిధిలోని 385 గ్రామాల్లో 871 రేషన్ డిపోలు ఉండగా, 355 ఎండీయూ వాహనాల ద్వారా 5.48 లక్షల కార్డులకు బియ్యం, పంచదారను పంపిణీ చేస్తున్నారు.

నాణ్యత లేని సరకుల విక్రయం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పెరిగిన ధరల నుంచి ఉపశమనం కల్పిస్తామంటూ రైతుబజార్ల ద్వారా బియ్యం, కందిపప్పును రాయితీపై అందించే విధంగా దుకాణాలను అట్టహాసంగా ప్రారంభించింది. అయితే బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.180 పలుకుతుండగా, రైతు బజార్లలో రూ.150కు అందిస్తున్నారు. సన్నబియ్యం మార్కెట్‌లో కిలో రూ.65 నుంచి రూ.72 ఉండగా, రైతుబజార్లలో రూ.47కి విక్రయిస్తున్నారు. అయితే రైతు బజార్లలో అందించే కందిపప్పు నాసిరకంగా ఉండడంతో వీటి కొనుగోలుకు ప్రజలు అంతగా ఆసక్తి చూపలేదు. అలాగే రైతు బజార్లలో విక్రయించే సన్నబియ్యం సైతం అత్యంత నాసిరకంగా ఉందని, అన్నం వండితే జావలా తయారవుతుందని మహిళలు వాపోతున్నారు. రేషన్ డిపోల సహకారంతో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్‌కార్డులున్న వారందరికీ రేషన్ బియ్యం, పంచదార సక్రమంగా అందడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం రేషన్ సరకులను అరకొరగా, సుమారు 70 నుంచి 90 శాతం కేటాయిస్తుండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది.

పంపిణీ ప్రారంభం ఎప్పుడో!

కూటమి ప్రభుత్వం 2024 జూన్ 12న అధికారం చేపట్టింది. జూలై ఒకటి నుంచే కందిపప్పును రాయితీపై పంపిణీ చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. నెలలు గడుస్తున్నా కందిపప్పు పంపిణీపైనే స్పష్టమైన విధానం లేకుండా కాలక్షేపం చేస్తుంది. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులను అడిగితే టెండర్లను ఖరారు చేస్తున్నాం.. వచ్చే నెల నుంచి రేషన్ డిపోలు అందుబాటులో ఉంటుందంటూ దాటవేత వైఖరిని అవలంబిస్తున్నారు. అయితే ప్రభుత్వ ఉదాసీన వైఖరితో ఇంకా కందిపప్పు సరఫరాకు సంబంధించిన టెండర్లు ఖరారు కాలేదని తెలుస్తోంది. టెండర్లు పిలిచి ఖరారు చేసిన తరువాత సంబంధింత కాంట్రాక్టర్ పంపించే కందిపప్పునకు పరీక్షలు నిర్వహించి ప్రజా పంపిణీ వ్యవస్థకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో టెండర్ల ప్రక్రియను వేగవంతం చేస్తే కందిపప్పు పంపిణీకి మరో రెండు నెలలు పట్టే అవకాశం ఉందంటూ ప్రభుత్వ అధికారులు అనధికారికంగా చెబుతున్నారు.

గతంలో కిలో రూ.67కు విక్రయాలు

కేంద్ర ప్రభుత్వం విధానాలతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ధరలు పెరిగినప్పుడు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో కందిపప్పును రూ.67కే అందించారు. సన్న బియ్యం ధర కిలో రూ 60 లోపు ఉండే విధంగా ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకునేది. నిత్యావసర సరకుల ధరల పెరుగుదలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర మంత్రి వర్గం వరుస సమీక్షలు నిర్వహించేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కందిపప్పు, బియ్యం, వంటనూనెల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ ప్రభుత్వానికి ఓటు బ్యాంకు రాజకీయాలే తప్ప ప్రజా ప్రయోజనాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాలు కొండెక్కుతున్నా ఆ మేరకు నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ధరల పెరుగుదలకు కారణమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరకుల పంపిణీ

జిల్లా వ్యాప్త సమాచారం ఇలా..

రేషన్ దుకాణాలు	871
ఎండీయూ వాహనాలు	355
రేషన్ కార్డులు	5.48 లక్షలు

నిత్యావసర సరకుల ధరల్లో తేడా

నిత్యావసరాలు	గత ప్రభుత్వంలో కిలో ధర	ప్రస్తుత ప్రభుత్వంలో కిలో ధర
సన్నబియ్యం	58	72
కందిపప్పు	155	180
సన్‌ఫ్లవర్	104	135
పామాయిల్	92	118
వేరుశనగనూనె	150	180
గోధుమ పిండి	45	60

కార్యరూపం దాల్చని మంత్రి హామీ

తొలుత కందిపప్పును రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై ఇస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇచ్చిన హామీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజులు దాటినా కార్యరూపం దాల్చలేదు. బహిరంగ మార్కెట్‌లో రికార్డు స్థాయిలో కందిపప్పు, వంటనూనెల ధరలు పెరిగినా, వీటిని రేషన్ ద్వారా అందించేందుకు అనేక కుంటిసాకులు చెబుతూ ప్రతి నెలా ప్రభుత్వం వాయిదా వేస్తూ వేస్తుంది. రాష్ట్ర మంత్రి హామీ ఇచ్చి నెలలు దాటుతున్నా పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, గోధుమపిండి, వంటనూనెల పంపిణీ ఎప్పుడు ప్రారంభమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

వాయిదా వేయడం సరికాదు



బహిరంగ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా కందిపప్పు ధర పెరిగింది. కొనలేక ఇబ్బంది పడుతున్నాం. రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం రాయితీపై కందిపప్పును అందించి పేదలకు ప్రయోజనం చేకూర్చాలి. ఈ పంపిణీని మూడు నెలల నుంచి వాయిదా వేయడం సరి కాదు.

–ఆకేటి లక్ష్మి,
వెదురుమూడి, కపిలేశ్వరపురం మండలం

రాయితీపై సరఫరా చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కందిపప్పును రాయితీపై అందజేస్తామన్న హామీని పాలకులు నిలబెట్టుకోవాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మాదిరిగానే ప్రస్తుతం ప్రభుత్వం రాయితీపై ప్రజలకు అందించే ఏర్పాట్లు చేయాలి.

–బుద్దిగ వీరవెంకట్రావు,
చెముడులంక,
ఆలమూరు మండలం

తుది దశకు టెండర్ల ప్రక్రియ

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పును అందించేందుకు చేపట్టిన టెండర్ల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వీలైనంత మేరకు విధి విధానాలను పూర్తి చేసి వచ్చే అక్టోబర్ నెల నుంచే కందిపప్పు పంపిణీని ప్రారంభిస్తాం. ప్రస్తుతం రేషన్ డిపోల ద్వారా రాగులను పంపిణీ చేస్తున్నాం. గోధుమ పిండిని పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం.

–ఎ.పాపారావు,
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

పనికి తగిన వేతనం ఇవ్వాలి



పలు అంశాలపై చర్చిస్తున్న జిల్లా సీఐటీయూ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, కంటింజెంట్, పార్ట్ టైమ్, గెస్ట్, గౌరవ వేతనం విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ అన్నారు. ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్న డిమాండ్‌తో సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి ఎన్‌హెచ్‌ఎం, ఇతర వైద్య ఆరోగ్య శాఖ స్కీమ్‌ల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, 2వ ఏఎన్‌ఎంలు, ఇతర క్యాడర్ల పారా మెడికల్ ఉద్యోగులను అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకుని రెగ్యులర్ చేయాలన్నారు. అలాగే సమగ్ర శిక్ష, వెలుగు, ఉపాధి హామీ తదితర ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించే ధర్నాను ప్రజా సంఘాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు ఎంఏ భాస్కరరావు, నాయకులు మలక సుభాషిణి, సీత, దేవి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దారికాచి దోపిడీ

అయినవిల్లి: గుర్తుతెలియని దుండగులు దారికాచి ఓ వ్యక్తిని చంపుతానని బెదిరించి రూ.12 వేలు దోపిడీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.మనోహరజోషి తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. అంబాజీపేట మండలం పసుపల్లి గ్రామానికి చెందిన మట్టపర్తి వెంకటేశ్వరరావు ముమ్మిడివరం మండల అనాతవరంలో కూరగాయల వ్యాపారం చేసుకుని శనివారం రాత్రి తన మోటార్ సైకిల్‌పై తిరిగి వెళ్తుండగా నలుగురు దుండగులు ఆపారు. అతని ముఖంపై తువ్వాలు వేసి మోటార్ సైకిల్ డిక్కీలో ఉన్న రూ.12 వేలు లాక్కున్నారు. ఇది ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బాలాత్రిపుర సుందరికి వెండి కిరీటం సమర్పణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక బాలాత్రిపుర సుందరి అమ్మవారికి కాకినాడకు చెందిన బోలిశెట్టి సతీష్, అనూష దంపతులు ఆదివారంరూ. 2.30 లక్షల విలువైన వెండి కిరీటం సమర్పించారు. దాతలకు ఆలయ ఈఓ వీర్రాజు చౌదరి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధిబాబ్జి పాల్గొన్నారు.

విస్ఫోట బాధితులకు రూ.2.60 లక్షల సాయం



బాధిత కుటుంబాలకు సాయం అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మీరాకుమార్

అమలాపురం టౌన్: స్థానిక రావులచెరువు ప్రాంతంలో ఇటీవల బాణసంచా విస్ఫోటం ఘటనలో తీవ్రంగా గాయపడిన ఏడు కుటుంబాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల గుత్తుల మీరాకుమార్ (జీఎంకే) చారిటబుల్ ట్రస్ట్ రూ.2.60 లక్షల సాయం అందించింది. దీనిని తెలంగాణ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గుత్తుల మీరాకుమార్ రావులచెరువులో బాధిత కుటుంబాలకు ఆదివారం అందజేశారు. ఇప్పటికే శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రూ.1.90 లక్షలు అందజేసిన విషయం విదితమే. ఈ సంస్థ జీఎంకే ట్రస్ట్‌ను కోరడంతో రూ.2.60 లక్షల సాయాన్ని సమకూర్చింది. తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన సంస్థ ప్రతినిధుల బృందం తొలుత రావులచెరువులో విస్ఫోట ధాటికి తునాతునకలైన ఇంటిని పరిశీలించింది. అనంతరం అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న ఏడుగురు క్షతగాత్రులను పరామర్శించింది. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, శెట్టిబలిజ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, మట్టపర్తి మీరాసాహెబ్ శెట్టి, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము, కముజు రమణ, కుడుపూడి భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

అనివేటి మంటపానికి కొత్త శోభ

- గ్రానైట్ ఫ్లోరింగ్‌తో మరింత అందంగా సత్యదేవుని ధ్వజస్తంభం
- తూర్పు రాజగోపురం వద్ద కూడా..
- రూ.ఎనిమిది లక్షలతో పనులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి విచ్చేసిన భక్తులకు తొలుత దర్శనమిచ్చేది స్వామివారి అనివేటి మంటపం. అత్యంత విశాలంగా, ఎదురుగా స్వామివారి ధ్వజస్తంభంతో కనిపించే ఈ అనివేటి మంటపం ప్రస్తుతం గ్రానైట్ ఫ్లోరింగ్‌తో ప్రత్యేక శోభ సంతరించుకుంది. ఈ అనివేటి మంటపంలో రూ.1,500 వ్రతాలతో బాటు ఉగాది వేడుకలు, స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలలో తొలి రోజు స్వామి, అమ్మవార్లను వధూవరులను చేయడం, ఉత్సవాల ఆరో రోజున నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు, స్వామివారి ఆవిర్భావ దినోత్సవం నాడు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ముగింపు దశకు పనులు

అంత ప్రాధాన్యం కలిగిన ఈ అనివేటి మంటపంలో గతంలో లేత గోధుమ రంగు గ్రానైట్ ఫ్లోరింగ్ ఉండేది. దానిపై నూనె మరకలు పడినా, లేక మరే ఇతర మరకలు పడినా వదిలేవి కాదు. దానికితోడు ఆ ఫ్లోరింగ్ తడిస్తే భక్తులు జారి పడిపోయేవారు. దీనికితోడు ఆ మంటపం వెనుక భాగంలో అంటే స్వామివారి ఆలయం వెనుక గతంలోనే తెలుపు రంగు మార్బుల్స్ ఫ్లోరింగ్ చేశారు. దీంతో ఒకే మంటపంలో ముందు భాగంలో ఎరుపు రంగు మార్బుల్స్, వెనుక భాగంలో తెలుపు రంగు గ్రానైట్ ఉండడంతో చూడ్డానికి కూడా ఎబ్బెట్టుగా కనిపిస్తోంది. దీంతో ఈ ఫ్లోరింగ్ స్థానంలో తెలుపు రఫ్ గ్రానైట్ ఫ్లోరింగ్ చేయించేందుకు ఈఓ కే రామచంద్రమోహన్ నిర్ణయించి పనులు చేయించడానికి టెండర్ పిలిచి ఖరారు చేశారు. ఈ నెల మొదటి వారంలో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ముగింపు దశకు చేరుకున్నాయి.



రూ.1,500 వ్రత మంటపంలో తెలుపు రంగు రఫ్ గ్రానైట్ ఫ్లోరింగ్ చేసిన దృశ్యం

స్వర్ణ ధ్వజస్తంభం చుట్టూ..

సత్యదేవుని సన్నిధిన రూ.మూడు కోట్ల వ్యయంతో ఏప్రిల్‌లో నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి దానికి స్వర్ణ రేకు తాపడం చేసిన విషయం తెలిసిందే. ఆ ధ్వజస్తంభం చుట్టూ కూడా ఈ తెలుపు రఫ్ గ్రానైట్ ఫ్లోరింగ్ చేయించడంతో ఆ ధ్వజస్తంభానికి మరింత శోభ చేకూరింది.



గ్రానైట్ ఫ్లోరింగ్‌తో ఆకర్షణీయంగా దర్శనమిస్తున్న స్వామివారి స్వర్ణ ధ్వజస్తంభం

తూర్పు రాజగోపురం లోపల కూడా...

గతంలో తూర్పు రాజగోపురం వద్ద కూడా గ్రానైట్ ఫ్లోరింగ్ ఉండేది. వర్షం దీనిపై పడ్డంతో భక్తులు జారిపోయి పడిపోయేవారు. ఇప్పుడు ఆ ఫ్లోరింగ్ స్థానంలో కూడా తెలుపు రఫ్ గ్రానైట్ ఫ్లోరింగ్ చేయిస్తున్నారు.

దీంతో అటు భక్తులు పడిపోకుండాను, ఆ ప్రాంతమంతా మరింత అందంగాను దర్శనమివ్వనుంది. అనివేటి మంటపానికి మార్బుల్‌తో చేసిన మెట్లు ఉండేవి. వాటి స్థానంలో గ్రానైట్ పలకలతో మెట్లు ఏర్పా టు చేస్తున్నారు. ఈ పనులన్నీ మరో వారం రోజుల్లో పూర్తి కానున్నాయి.

నేడు సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ గోదావరి భవన్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని అన్నారు.

వచ్చే నెల 3 నుంచి టెట్

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- జిల్లాలో పరీక్ష రాయనున్న 3,221 మంది అభ్యర్థులు

రాయవరం: జిల్లాలో వచ్చే నెల 3 నుంచి 21వ తేదీ వరకూ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహించనున్నారు. ఇందుకు గాను అమలాపురం భట్లపాలెంలోని బీవీసీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలను పరీక్ష కేంద్రంగా ఎంపిక చేశారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిన విషయం పాఠకులకు విదితమే. ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. డీఎస్సీకి అవసరమైన అర్హత పరీక్ష టెట్‌కు జూలై 2న నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 3,221 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఈ పరీక్షల్లో ఉదయం సెషన్‌ను 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంలో భాగంగా ఎంఈఓ స్థాయి అధికారిని డిపార్ట్‌మెంటల్ అధికారిగా, డీవైఈఓ స్థాయి అధికారితో స్క్వాడ్‌ను నియమించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫొటో లేని హాల్ టిక్కెట్‌తో వచ్చే అభ్యర్థులను పరీక్ష కేంద్రం వద్ద ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు, తాజా ఫోటోను పరిశీలించి అనుమతిస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన దివ్యాంగులకు అదనంగా 50 నిమిషాల సమయం కేటాయిస్తారు. పరీక్షల నిర్వహణలో అనుమానాల నివృత్తికి ఉదయం 7.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలను కల్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా, అలాగే వైద్య సదుపాయం, తాగు నీరు వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

క్లుప్తంగా

జాతీయ చెస్ పోటీల్లో బంగారు పతకం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగిన కేంద్రీయ విద్యాలయాల 53వ జాతీయ స్థాయి చెస్ పోటీల్లో కాకినాడ జిల్లా పి.వెంకటాపురం కేంద్రీయ విద్యాలయం పదో తరగతి విద్యార్థి సూరాడ యశస్వి సత్యగంగాధర్ బంగారు పతకం సాధించాడు. ఈ పోటీలకు 25 రీజియన్ల నుంచి 120 క్రీడాకారులు హాజరయ్యారు. ఏపీ, తెలంగాణ రీజియన్‌కు చెందిన గంగాధర్ 9 రౌండ్లలో 7.5 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచాడు. అతన్ని పాఠశాల ప్రిన్సిపాల్ బి.శేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో అండర్–14, 17 విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేస్తారు. ఈ విషయాన్ని సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.జార్జి ఆదివారం తెలిపారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, యోగా, చెస్, కరాటే అండర్–14, 17 విభాగాల్లో బాలురు, బాలికల ఎంపికలు ఉంటాయన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధి, మన్యం జిల్లా కలిపి ఈ ఎంపికలకు ఎంపికైన క్రీడాకారులు ఉదయం 9 గంటలకు అర్హత పత్రాలతో డీఎస్ఏలో రిపోర్టు చేయాలని ఎస్‌జీఎఫ్ఐ సంయుక్త కార్యదర్శి సునీల్ కోరారు.

హాకీ ఆంధ్రప్రదేశ్ సంయుక్త కార్యదర్శిగా రవిరాజు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ సంయుక్త కార్యదర్శిగా కాకినాడ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు జిల్లాలో హాకీ ఆంధ్రప్రదేశ్ సాధారణ సమావేశం, రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో హాకీ ఆంధ్రప్రదేశ్ సంయుక్త కార్యదర్శిగా ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ రవిరాజును ఎన్నుకున్నారు. 24 ఏళ్లుగా జిల్లా జట్టును విజయపథంలో నడిపించడంలో రవిరాజు కీలక పాత్ర పోషించారు. ఈ ఎన్నిక పట్ల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్, జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఎలీషాబాబు, జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 కార్యదర్శి జార్జి, సంయుక్త కార్యదర్శి సునీల్, పీడీలు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి గల్లంతు

కిర్లంపూడి: ఏలేరు కాలువలో పడి ఓ వ్యక్తి గల్లంతైన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.సతీష్ వివరించారు. ఆయన కథనం ప్రకారం.. గోనేడ గ్రామానికి చెందిన కోలా సత్యనారాయణ ఆదివారం సాయంత్రం ఏలేరు కాలువ గట్టు వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో కాలుజారి కాలువలో పడిపోవడంతో వరద నీటిలో చిక్కుకుని కొట్టుకుపోయాడు. అది గమనించిన స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు సత్యనారాయణ కుమారుడు కోలా నాగార్జున ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మళ్లీ మళ్లీ.. ఇదేం లొల్లి

- పట్టభద్రులు తిరిగి ఓటు నమోదు చేసుకోవాల్సిందే
- పాత జాబితా లేదంటున్న ప్రభుత్వం
- నేటి నుంచి కొత్తగా నమోదు ప్రక్రియ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఓటర్లు



ఆలమూరు: ఏ ప్రక్రియ చేపడితే సులువైన మార్గం ఎంచుకోవాలి.. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలి.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తంతు మాత్రం ప్రహసనంలా మారింది.. ఇందులో ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు తిరిగి నమోదు చేసుకోవాలని చెబుతుండడం అందరికీ ఇబ్బంది అవుతోంది. వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడి వరకూ బాగానే ఉన్నా, గతంలో ఓటుహక్కు వినియోగించుకున్న పట్టభద్రుల జాబితా లేదంటూ మళ్లీ కొత్తగా ఓటర్ల నమోదుకు చర్యలు చేపట్టింది. ఉభయ గోదావరి జిల్లాల్లోని అర్హులైన పట్టభద్రులంతా ఈ నెల 30 నుంచి ఆన్‌లైన్‌లో లేకుంటే ఆఫ్‌లైన్‌లో తమ ఓటును నమోదు చేసుకోవాలి. పట్టభద్రుల పాత ఓటరు జాబితా అందుబాటులో లేకపోవడంతో మళ్లీ తమ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెబుతోంది.

ఈ ఎన్నికలు జరిగే ప్రతిసారీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలంటే ఎలా అంటూ ఓటర్లు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోయినా పట్టభద్రులైతే ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఎమ్మెల్సీకి పోటీ చేసే అభ్యర్థికి తొలి, ద్వితీయ, తృతీయ ప్రాధాన్య ఓట్ల ద్వారా కనీసం 50 శాతం ఓట్లపైనే నమోదైతేనే విజయం వరిస్తుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 2019 పట్టభద్రుల ఎన్నికల్లో 2,93784 మంది ఓటర్లు ఉండగా, 1,92,137 మంది మాత్రమే ఓటు వినియోగించుకున్నారు. మార్చి 2025లో జరిగే పట్టభద్రుల ఎన్నికలకు సుమారు మూడు లక్షలకు పైగా నమోదు చేసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

నిబంధనలు ఇవీ..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే నియోజకవర్గాల పరిధిలోని ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారందరూ మళ్లీ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి.
- పట్టభద్రుల ఓటర్లంతా ఫామ్–18 వినియోగించి ఓటు హక్కుకు దరఖాస్తు అందించాలి.
- సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6 వరకూ ఆన్‌లైన్‌లో లేకుంటే ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.
- ఎమ్మెల్సీ ఎన్నికల ఓటును ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు నేరుగా ఇంటి చిరునామాకు వచ్చి ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.
- ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఏవిధమైన పరిశీలన ఉండదు.

అందించాల్సిన ధ్రువీకరణ పత్రాలు

ఫామ్–18ను తీసుకుని తొలుత వివరాలను పూరించాలి. ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ నకలు, నివాస ధ్రువపత్రం వీటన్నింటిని కలిపి ఒక సెట్‌గా చేసి సమీప మండల తహసీల్దార్ కార్యాలయంలో అందించాలి. లేకుంటే గ్రామ సచివాలయం, మీసేవా కేంద్రాల్లో అందించి నమోదు చేసుకోవచ్చు.

హక్కులను హరించినట్టే..



పట్టభద్రుల ఎన్నికలు జరుగుతున్న ప్రతిసారీ ఓటు నమోదు చేయించుకోమనడం సరికాదు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయకుండా ఏకపక్షంగా ఉత్తర్వులు ఇవ్వడమంటే పట్టభద్రుల హక్కులను హరించినట్లే. గతంలో పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేసిన వారిని నమోదు నుంచి మినహాయించాలి.

– కె.విద్యాధరి, బీకాం, కడియపులంక

పునరాలోచన చేయాలి



పట్టభద్రుల ఓటు నమోదును గ్రామ సచివాలయాల్లో చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలి. ఎన్నికల జరిగిన ప్రతిసారీ ఓటు నమోదు చేయించుకోవాలనుకోవడం పట్టభద్రులను అనుమానించడమేనని భావిస్తున్నాను. దీనిపై ఎన్నికల కమిషన్ పునరాలోచన చేయాలి.

– బి.రాణి అనూష, సంధిపూడి

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఆదివారం కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో వెయిట్‌లిఫ్టింగ్ హాల్‌లో ఎస్‌జీఎఫ్ఐ అండర్–17, 19 పోటీలు, ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలను డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్‌లో డీఎస్ఏలో జాతీయస్థాయి సదుపాయాలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అండర్–19 కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ అండర్–19 విభాగానికి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ ఎంపికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అండర్–14, 17 కార్యదర్శి ఎల్.జార్జి మాట్లాడుతూ వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 165 మంది రావడం అభినందనీయమని తెలిపారు. డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా జట్టును ఎంపిక చేస్తాన్నారు. జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు బీవీపీ శివకిశోర్ సౌజన్యంతో ఎంపికలు నిర్వహించి, క్రీడాకారులకు భోజన సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో పీడీలు మాచరరావు, శ్రీనివాస్, వాసు, డిఎస్ఏ కోచ్‌లు సతీష్‌కుమార్, సురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొలిపేదే కవిత్వం



మాట్లాడుతున్న ప్రముఖ కవి మధునాపంతుల సత్యనారాయణమూర్తి

కాజులూరు: సమాజాన్ని మేల్కొలిపేలా కవిత్వం ఉండాలని ప్రముఖ కవి, రచయిత మధునాపంతుల సత్యనారాయణ మూర్తి అన్నారు. పల్లిపాలెం కామరాజు కళాక్షేత్రంలో కేంద్ర సాహిత్య అకాడమీ, ఆంధ్రీకుటీరం సంయుక్త నిర్వహణలో ఆదివారం కవితా పఠనం నిర్వహించారు. 'కవి సంధి' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర సాహితీ అకాడమీ సలహా మండలి సభ్యుడు చింతకింది శ్రీనివాసరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. మధునాపంతుల సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ యువతరం కవులు, రచయితలు తమ పూర్వ కవుల సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని, తద్వారా ఆధునికతతో కూడిన మంచి సాహిత్యాన్ని సృష్టించగలుగుతారన్నారు. తెలుగు కవిత్వం తీరు తెన్నులు, స్వీయ కవిత్వం, రచనల్లో ఆయనకు ప్రేరణ ఇచ్చిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయితలు దాట్ల దేవదానంరాజు, అవధానుల మణిబాబు, ఆంధ్రీ కుటీరం కార్యదర్శి ఎంవీ చలపతి, పలువురు సహ కవులు, కథకులు పాల్గొన్నారు.

అదిగో పులి.. ఇదిగో తోక

- చిరుత సంచారంపై గుప్పుమంటున్న వదంతులు
- రావులపాలెంలో కనిపించిందంటూ కలకలం
- నిజం లేదంటున్న అటవీ శాఖ అధికారులు



చిరుత పులి వచ్చిందన్న వదంతులతో గోదావరి పాత బ్రిడ్జిపై గుమిగూడిన జనం

రావులపాలెం/ కడియం: అదిగో పులి.. ఇదిగో తోక అంటూ వదంతులు గుప్పుమంటున్నాయి.. ఆదివారం రావులపాలెంలో చిరుత సంచరించిందంటూ వచ్చిన వదంతులు ప్రజల్లో భయాందోళన రేకెత్తిస్తున్నాయి. ఇందులో ఏమాత్రం నిజం లేదని అటవీ శాఖ అధికారులు కొట్టిపారేశారు. కడియపులంక పంచాయతీ బుర్రిలంకలోని నర్సరీల్లో చిరుతపులి సంచారం వారం రోజుల పాటు స్థానికంగా కలకలం రేపింది. అధికార యంత్రాంగం రంగప్రవేశం చేసి చిరుతను పట్టుకునే ప్రయత్నాలు మొదలు పెట్టింది. అయితే చిరుత జాడ మాత్రం చిక్కలేదు. ఆదివారం రావులపాలెంలో పలు వదంతులు బయటకు రావడంతో ఎక్కడబడితే అక్కడ జనం గుమిగూడి పులి వచ్చిందనే అంశంపై చర్చించుకుంటున్నారు. మత్స్యకారులు కొందరు ఈ నెల 27 తేదీ రాత్రి సమయంలో రావులపాలెం గౌతమి గోదావరిలోకి వేటకు వెళ్లినప్పుడు దుబ్బుల్లో పులి కదలికలు కనిపించాయని, దాంతో తాము ఒడ్డుకు వచ్చేశామని చెప్పడంతో ఈ విషయం ఆ నోట ఈ నోట వ్యాపించింది. దీంతో ఆదివారం కోనసీమ జిల్లా ఫారెస్ట్ అధికారి ఎంవీ ప్రసాదరావు తన సిబ్బందితో రావులపాలెం గౌతమి కొత్త బ్రిడ్జి సమీపంలో పులి ఆచూకీ కోసం గాలించినా ఎటువంటి ఆధారాలు లభించలేదు. మత్స్యకారులు చెబుతున్నట్టుగా గోదావరి మధ్యలో దిబ్బలపై పులి జాడలు ఉన్నాయేమో అని పరిశీలించేందుకు సోమవారం పడవలపై వెళ్తామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇప్పటి వరకూ ఎటువంటి జాడలు లేవని, ప్రజలు వదంతులను నమ్మవద్దని అన్నారు. అలాగే సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు కూడా ఒకరకంగా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, ఇటువంటి సమాచారం కాకుండా కచ్చితమైన సమాచారం తెలియజేయాలన్నారు. పులిని పట్టుకునేందుకు యంత్రాంగం శ్రమిస్తుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ జిల్లాలకు చెందిన ఫారెస్ట్ అధికారులు 60 మంది వరకూ పనిచేస్తున్నారని ఆయన వివరించారు.

కనిపిస్తూ.. జాడ లేకుండా పోతూ..

సెప్టెంబర్ 6న దివాన్‌చెరువు అటవీ ప్రాంతం నుంచి చిరుత కదలికలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రారంభమయ్యాయి. అక్కడి నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. 24న కడియం మండలం కడియపులంకలో దోసాలమ్మ కాలనీ ప్రాంతంలో చిరుత పులి కనిపించడంతో ఫారెస్ట్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆ సమయంలో కోనసీమకు చెందిన డీఎఫ్ఓ ప్రసాదరావు ఆధ్వర్యంలో పులిని పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. 25న అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. 60 మంది అటవీ శాఖ అధికారులు పది బృందాలుగా విడిపోయి, నాలుగు బోన్లు, 20 ట్రాప్ కెమెరాలు, ఆరు సీసీ కెమెరాలు, నాలుగు మేక పిల్లలు, ఇలా అన్ని హంగులతో పులిని బంధించేందుకు చర్యలు చేపట్టారు. అయితే 26న రాత్రి వరకూ పులి అడుగుజాడలు కడియపులంక పరిసర ప్రాంతాల్లో కనిపించాయి. తరువాత నుంచి స్పష్టమైన జాడలు ఎక్కడా లభించలేదని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

మళ్లీ ఇక్కడంటూ..

పలు ప్రాంతాల్లో పులి కనిపించిందంటూ వదంతులు సోషల్ మీడియాలో వ్యాపించడంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా చర్చలు జరుగుతున్నాయి. 27న ఊబలంక– రావులపాలెం మధ్యలో అంకాలమ్మ పుంత సమీపంలో పులి అడుగు ముద్రలు ఉన్నట్టు కలకలం రేగింది. అయితే శనివారం స్థానిక గౌతమి గోదావరిలో బ్రిడ్జిల సమీపంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు లంక ప్రాంతాల్లో చిరుత పులిని చూసినట్లు చెప్పడంతో ఆ ప్రాంతంలో పులి ఉందని వదంతులు వ్యాపించాయి.



రావులపాలెంలో స్థానికుల నుంచి సమాచారం సేకరిస్తున్న జిల్లా ఫారెస్ట్ అధికారి ప్రసాదరావు

వేట్లపాలెంలో చోరీ



సంఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: పట్టపగలే తాళం వేసిన ఇంట్లోకి చొరబడి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. సామర్లకోట మండల వేట్లపాలెంలో గుణ్ణం సాయిబాబా కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి రూ.లక్ష, 15 కాసుల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. గ్రామంలో పరామర్శ కార్యక్రమానికి వెళ్లి వచ్చే లోపే ఇంటి తాళం తీసి ఉండటం, బీరువా తెరచి ఉండటంతో సాయిబాబా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కృష్ణభగవాన్ సంఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండలంలోని పులిదిండి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడేనికి చెందిన మంచిమి సత్యనారాయణ తన భార్యతో కలసి శనివారం వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని వెళ్తుండగా బైక్‌పై నుంచి జారిపడ్డారు. దీంతో భార్యాభర్తలిద్దరికీ గాయాలయ్యాయి. వారిని రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సత్యనారాయణ ఆదివారం మృతి చెందాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

REAL ESTATE

■ రాజమండ్రికి అతి చేరువలో గేటెడ్ కమ్యూనిటీ నందు ఇంటి నిర్మాణానికి అనువుగా గల అప్రూవ్ లే-అవుట్ నందు ఓపెన్ ప్లాట్స్, కమర్షియల్ బిట్స్ అమ్మకమునకు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్ర॥ 9708 877 977 [R-945]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2563]

Wanted

■ కాకినాడ FOTON DOORS కంపెనీ నందు పనిచేయుటకు Marketing Executives (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి. సంప్ర॥ 88826 56789 [R-1260813]

■ Wanted for Diagnostic centre (Kakinada & Amalapuram) Lab Technician 2 Nos (M/F), X-ray Technician 2 Nos (M/F), Cont: 9676810372, 9397662312 [C-800082]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9182260297 [HA-98612]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18k. ఫోన్: 9640258899, 9640468899 [H-796281]

■ MSME (ZED) నందు పనిచేయుటకు Degree చదివిన అభ్యర్థులు వెంటనే కావలెను. ఆసక్తి గల వారు వివరాలకు సంప్ర॥ ✆ 80084 71348 [O-190047]

■ శ్రీ లక్ష్మీహోంకేర్: హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషంట్లకు సేవ చేయుటకు బేబికేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం: 18000/- రూం+ మీల్స్ ఫ్రీ. 9347148051 [G-2182]

■ విజయవాడలో సంపన్నుల / పెద్దవారి ఇళ్ళ వద్దే ఉండి, పేషెంట్‌లని / Bed Ridden వారిని చూసుకొనుటకు అనుభవం గల కేర్ టేకర్స్ M/F నర్సులు, RMPలు కావలెను. ✆ 91608 35559, 98850 25559 [B-240]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185460]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక



కోచ్ సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న అతిథులు, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ముఖ్య అతిథిగా జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు కిశోర్, గౌరవ అతిథిగా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి హాజరయ్యారు. దీనికి డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ వి.సతీష్ కుమార్ అధ్యక్షత వహించారు. అండర్–17, 19 విభాగాల్లో జిల్లా స్థాయిలో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు, క్రీడా దుస్తులను కిషోర్, జార్జి అందజేశారు. ఈ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ సతీష్‌కుమార్‌ను అతిథులు, క్రీడాకారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ రమణ, వెయిట్ లిఫ్టింగ్ సంఘ సీనియర్ సభ్యులు రామకృష్ణ, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పందలపర్రులో ఇసుక రవాణాపై వివాదం



పందలపర్రు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద తగాదా పడుతున్న ఇరువర్గాలు

నిడదవోలు రూరల్: పందలపర్రు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద రవాణాకు సంబంధించి ఆన్‌లైన్ బుకింగ్ బిల్లులపై ఆదివారం వివాదం తలెత్తడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఆన్‌లైన్ బిల్లులు పరిశీలిస్తున్న గ్రామ వీఆర్వో సత్యనారాయణ వద్దకు విజ్జేశ్వరం గ్రామానికి చెందిన ఇసుక లారీ యజమాని డి.రాజ్‌కుమార్ వచ్చి ఆన్‌లైన్ బుకింగ్ బిల్లు చూపించకుండానే రెండు లారీల్లో ఇసుక లోడ్ చేయించుకున్నాడు. దీంతో అక్రమంగా లోడ్ చేయించుకున్నాడనే అనుమానంతో కొంతమంది మీడియాకు సమాచారం ఇచ్చారు. నిడదవోలుకు చెందిన విలేకరి దొడ్డిగర్ల ప్రకాష్‌తో పాటు మరో విలేకరి స్టాక్ పాయింట్ వద్దకు చేరుకుని వీఆర్వో సత్యనారాయణను ప్రశ్నించారు. దీంతో లారీ యజమాని రాజ్‌కుమార్, విలేకరి ప్రకాష్‌లు ఘర్షణ పడి దూషించుకున్నారు. ఘటనా స్థలానికి ఎస్సై రమేష్ చేరుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదని, బాధితుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున కూటమి పార్టీలకు చెందిన అనుచరులు బిల్లులు లేకుండానే లారీల్లో ఇసుక లోడ్ చేయించుకుని వెళ్లడంతోనే కొంతమంది లారీ యజమానులు రెవెన్యూ అధికారులను బెదిరించి ఆన్‌లైన్ బిల్లు చూపించకుండానే ఇసుక లోడ్ చేయించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కెమెరాలు తొలగించి.. చోరీ చేసి

- రూ.10 లక్షల సొత్తు అపహరణ
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్



బెండపూడి శివారులో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

తొండంగి: బెండపూడి శివారు గొడేవారి తోటలో ఓ ఇంట్లోకి దుండగులు చొరబడి సీసీ కెమెరాలు తొలగించి, సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. తొండంగి మండలం బెండపూడి శివారు, అన్నవరం సరిహద్దు ప్రాంతమైన గొడేవారి తోటలో జి.జగదీష్ ప్రసాద్ ఇల్లు నిర్మించుకుని కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. కుటుంబ సభ్యులంతా కలసి ఈ నెల 26న తిరుపతి వెళ్లారు. తిరుపతి నుంచి తిరిగి ఆదివారం ఉదయం చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి చూసేసరికి వెనుక వైపు ద్వారం తలుపులు, మాస్టర్ బెడ్‌రూమ్ తాళాలు, ఇతర సామగ్రి చిందరవందరగా ఉండటంతో భయాందోళనకు గురయ్యారు. వెంటనే తొండంగి పోలీసులకు సమాచారం అందించడంతో తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై జగన్మోహన్‌రావు వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్ సిబ్బంది వచ్చి ఆధారాలు సేకరించారు. కాగా రూ.10 లక్షల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కాగా ఇంట్లో యజమాని జగదీష్ ప్రసాద్ ఏర్పాటు చేసిన మూడు సీసీ టీవీ కెమెరాలను కూడా దొంగలు దోచుకెళ్లారు. ఆధారాలు లభించకుండా సీసీ కెమెరాలను కూడా దోచుకెళ్లడంతో బాధితులు మరింత ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎస్సై జగన్మోహన్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రాంతాన్ని ఆదివారం రాత్రి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పరిశీలించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

వరుస చోరీలతో బెంబేలు

ఇటీవల కాలంలో బెండపూడి శివారు ప్రాంతంలో అన్నవరం సరిహద్దు కావడంతో ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. దొంగలు శివారు ప్రాంతాలను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. పగలు రెక్కీ నిర్వహించి, ఎవరూ లేని ఇళ్లను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. నెల రోజుల్లో అన్నవరం, బెండపూడి శివారు సరిహద్దు ప్రాంతంలో మూడు చోరీలు జరిగాయి. అదేవిధంగా సీతారాంపురం, ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. దీనిపై ఫిర్యాదులు అందడంతో పోలీసులు తమదైన శైలిలో దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్య తక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం



స్కూల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల, చిత్రంలో శేషారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నామవరం వెళ్లే రోడ్డులో పిట్టలవాని చెరువు దగ్గర విశాలమైన ప్రాంగణంలో ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి నెలకొల్పిన ఆదిత్య తక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ జి.నాగమణి ఆయా విభాగాలను ప్రారంభించారు. శేషారెడ్డి, డైరెక్టర్ శృతి రెడ్డి, ప్రిన్సిపల్ లిసాకుమార్ బర్దన్ అతిథులకు స్వాగతం పలికారు. మేథ్స్, సోషల్, సైన్స్ ల్యాబ్లు, లైబ్రరీ, విశాలమైన ప్రాంగణంలో క్రీడా సముదాయం తదితరాలు ఏర్పాటు చేశారు. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఆదిత్య విద్యా సంస్థలను శేషారెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. ల్యాండ్‌లార్డ్ బొప్పన సుజాత, ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, వాసిరెడ్డి రాంబాబు, చెరుకూరి రామారావు, మార్ని వాసుదేవ్, బొప్పన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి గల్లంతు



ఎలుగుబంటి వినయ్ (ఫైల్)

సీతానగరం: ఫొటో షూట్ ఓ యువకుడిని గల్లంతు చేసింది. పదో తరగతి విద్యార్థులు నలుగురు చెరువు వద్దకు వెళ్లి ఫొటోలు తీసుకునే క్రమంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడడంతో గల్లంతయ్యాడు. ఆ వివరాల్లోకి వెళితే.. సీతానగరం పంచాయతీ పరిధి లంకూరుకు చెందిన నాగేంద్ర, రామ్ నాగేంద్ర, సీతానగరానికి చెందిన ఎలుగుబంటి వినయ్, రాపాక పంచాయతీ పరిధి శ్రీరామనగరానికి చెందిన చిరు కలసి రఘుదేవపురం నల్గొండ రోడ్డులో పేరంటాల అమ్మవారి గుడి వద్ద గొప్పి కాలువ వద్దకు ఫొటోలు తీసుకోవడానికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లారు. నలుగురు స్నేహితులు ఫొటోలు తీసుకునే నేపథ్యంలో వినయ్ గొప్పి కాలువ ఒడ్డున నిలబడి ఉండగా ప్రమాదవశాత్తూ కాలువలో పడి గల్లంతయ్యాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో మిగతా ముగ్గురు విద్యార్థులు గ్రామంలోకి వచ్చి వినయ్ గురించి స్థానికులకు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై రామ్‌కుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, వీఆర్వో వెంకట్రావు పర్యవేక్షించారు. నలుగురు స్నేహితులు రఘుదేవపురంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నారు. వినయ్ తండ్రి శ్రీను, తల్లి బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది.